ఈనాడు ఆదివారం
Sunday, July 31, 2011 17: 04 hrs IST



# గెలుస్తూ గెలిపిస్తూ!

ఓడిపోవడం... కొంతమందికి ఇష్టం ఉండదు! మిన్ను విరిగి మీదపడ్డా వెన్ను విరిగి మంచానపడ్డా వాళ్లు ఓడిపోరు! వాళ్ల గెలుపు రహస్యం... బతికినంతకాలం ఓడిపోకూడదన్న సంకల్ప బలం.



ఇద్దరు కుర్రాళ్లు. ఒకరిది అమెరికా... మరొకరిది ఆంధ్రా! అమెరికా కుర్రాడు... జొనాథన్ సిగ్వర్త్.ఇతడు ఫొటోగ్రఫీ స్టూడెంట్. పర్వత ప్రాంతాల్లో సైకిల్‌పై ప్రయాణాలంటే చాలా ఇష్టం. ఓసారి మనదేశానికి వచ్చాడు. ముస్సోరీ ప్రాంతంలో సరదాగా సైక్లింగ్‌కి బయలుదేరాడు. చల్లనిగాలీ పచ్చని చెట్లూ ఆహ్లాదకరమైన వాతావరణంలో దూసుకుపోతున్నాడు. పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించలేకపోయాడు. హఠాత్తుగా సైకిల్ అదుపుతప్పింది. 70 అడుగుల ఎత్తునుంచి కిందపడ్డాడు. స్పృహకోల్పోయాడు. వెంటనే ఆసుపత్రిలో చేర్చారు. చికిత్సలు జరిగాయి. తరవాత జొనాథన్‌కి స్పృహ వచ్చింది. డాక్టర్లు వచ్చారు. వాళ్లని అతడు అడిగిన ప్రశ్న... 'నేను ఇకపై నడవగలనా? '

* * *

ఆంధ్రా కుర్రాడు... దిలీప్ పాత్రో. పుట్టింది ఒరిస్సాలోని బరంపురంలో. తరువాత విశాఖపట్నానికి వచ్చేశారు. ఇతడి తండ్రి కిరాణా వ్యాపారి. దిలీప్ ఎంసీయే చేశాడు. ముంబై

లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం సంపాదించాడు. ఓసారి ఆఫీస్ పని మీద అమెరికా వెళ్లాల్సి వచ్చింది. ఆరోజు వీసా తీసుకుని ఇంటికి వస్తున్నాడు. ఓచోట రోడ్డు దాటాల్సి వచ్చింది. దాటుతుండగా... అమాంతంగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. వెంటనే దిలీప్‌ని ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు చికిత్స చేశారు. తరువాత దిలీప్ బంధువులు డాక్టర్ని అడిగిన ప్రశ్న... 'మావాడు ఇక నడవలేడా? '




*'అవును... మీరు ఇకపై నడవలేరు!*
వెన్నుపూసకి బలమైన గాయమైంది. నడుము కింది భాగమంతా స్పర్శ కోల్పోయింది. దీన్ని పారాప్లెజిక్ అంటారు'- జొనాథన్‌కి షాక్. అమెరికా వెళ్లిపోయాడు. అతడి జీవితమంతా మారిపోయింది. ఫ్రెండ్స్ మారిపోయారు. ఒకప్పుడు సరదా కబుర్లు చెప్పేవారు, ఇప్పుడు ధైర్యం చెబుతున్నారు, సానుభూతి చూపిస్తున్నారు. ఇవేవీ జొనాథన్‌కి నచ్చలే. ఎందుకంటే అతడు ఓడిపోలేదు! 'నేను నడవలేను. ఆ సంగతి నాకూ తెలుసు. గతాన్ని మార్చలేం. కానీ, భవిష్యత్తును మార్చుకోవచ్చు. బహుశా నేను ఇంకేదో పని చెయ్యగలనని దేవుడు ముందే రాసిపెట్టి ఉంటాడు' అనుకున్నాడు జొనాథన్. తనలా వెన్ను విరిగి బాధపడుతున్నవాళ్లకి సాయం చెయ్యాలనుకున్నాడు. ఓ స్వచ్ఛంద సంస్థని ప్రారంభించాడు. తనలా బాధపడేవాళ్లు ప్రపంచంలో ఏదేశంలో ఏమూల ఉన్నారని తెలిసినా అక్కడికి వెళ్లిపోతాడు. వాళ్లకి ధైర్యం చెబుతాడు. వాళ్లలో స్ఫూర్తిని రగిలిస్తాడు. కావాల్సిన సాయం అందిస్తున్నాడు.

'అవును.. మీవాడు నడవలేడు'- దిలీప్ కుటుంబ సభ్యులకి డాక్టర్ చెప్పిన సమాధానం


Skeleton Stride
Party at Cemetery
Halloween Fun
Haunted House
3D Halloween Scene
Walking Monsters
Ghost Hallway
Skeleton Stride
Preview
More!
POPULAR SCREENSAVERS

ఇదే. కొన్నాళ్లు ఢిల్లీలో చికిత్స చేయించారు. ప్రయోజనం లేకపోయింది. పదేళ్లు... మంచానికే పరిమితం. ఆశలు చచ్చిపోయాయి. ఆశయాలు మాసిపోయాయి. దిలీప్ పాత్రో జీవితం చిన్నదైపోయింది. ఓసారి ఇంటర్‌నెట్‌లో జొనాథన్ గురించి చదివాడు దిలీప్. 'మనకు లేనివి కాళ్లే. కానీ ప్రయాణించాల్సిన జీవితం చాలా ఉంది' అనే జొనాథన్ మాటలు దిలీప్‌లో కొత్త స్ఫూర్తిని రగిలించాయి. సొంతంగా కారు డ్రైవింగ్ చేసుకుంటూ వివిధ దేశాలకు ప్రయాణిస్తూ జొనాథన్ హాయిగా జీవితం సాగిస్తున్నాడు. 'అతడిలా సంతోషంగా నేనెందుకు ఉండలేను' అనుకున్నాడు. తన పరిస్థితిని తెలియజేస్తూ జొనాథన్‌కి ఈమెయిల్ పంపాడు దిలీప్. అంతే, జొనాథన్ వైజాగ్ వచ్చేశాడు!

అవును, దిలీప్ మెయిల్ చూడగానే జొనాథన్ వైజాగ్ వచ్చేశాడు. ఒక్కడే నేరుగా దిలీప్ ఇంటికి వచ్చేశాడు. 'యస్... నేను దిలీప్ పాత్రో కోసమే వచ్చాను. వైకల్యంతో బతకడం తప్పుకాదు. నిరాశతో బతకడం తప్పు. కేవలం నడవలేకపోవడం అనేది వేరే ఏ పనులకూ అడ్డంకి కాదు. జీవితం విలువేంటో పదిమందికీ తెలిసేలా మనం బతకాలి' అని చెప్పాడు జొనాథన్. అతన్ని చూసిన దిలీప్‌లో కొత్త శక్తి. తన పనులు తానే చేసుకోవడం మొదలుపెట్టాడు. ఇంట్లో కూర్చునే తన ఉద్యోగాన్నీ చేయడం ప్రారంభించాడు. అంతేకాదు, కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందాడు. ఇదంతా తనకోసం చేసుకున్నవి! ఇక, తనలాంటి వారికోసం కూడా ఆలోచించాడు దిలీప్.




ద ఎబిలిటీ పీపుల్... దిలీప్ పాత్రో ప్రారంభించిన సేవా సంస్థ. తనలాగే నడవలేనివారికోసం ఏర్పాటు చేసింది. దేశం నలుమూలల నుంచి ఇప్పటివరకూ దాదాపు 200 మంది ఇందులో చేరారు. వాళ్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తూ వాళ్లల్లో స్ఫూర్తి నింపుతున్నాడు దిలీప్. రోడ్డు ప్రమాదాల్లో ఎవరికైనా వెన్నుపూస దెబ్బతింటే పోలీసుల సాయంతో వాళ్లని కలిసి కౌన్సిలింగ్ చేస్తున్నాడు. ప్రమాదాల్లో

గాయాలపాలైనవారికి తక్షణం ఎలాంటి సాయం అందించాలన్న అంశంపై శిబిరాలు నిర్వహిస్తున్నాడు. బాధితులకు తక్షణ సాయం అందించేందుకు ఓ హెల్ప్‌లైన్ (85003 65736) కూడా ప్రారంభించాడు. అంతే కాదు, బాధితులకు ప్రత్యేకమైన వీల్‌ఛైర్లను కూడా తయారు చేయించి అందిస్తున్నాడు. ఇప్పుడు దిలీప్ తనలా వెన్నుపూస కోల్పోయిన ఎంతోమందికి స్ఫూర్తిప్రదాత.

ఒక వ్యక్తి జీవితంలో ఓటమిని అంగీకరిస్తే ఆ ఒక్కడే ఓడిపోతాడు. అదే ఓటమిని అంగీకరించక సవాలుగా తీసుకుంటే తాను గెలవడంతోపాటు తనలాంటి వాళ్లెందరినో గెలుపు బాటలో నడిపించగలడు. జొనాథన్ సిగ్వర్త్, దిలీప్ పాత్రో... ఇద్దరూ జీవితంలో ఓడిపోలేదు. తమలాంటివాళ్లని ఓడిపోనివ్వడం లేదు!

*- ముత్తా నారాయణరావు, న్యూస్‌టుడే, విశాఖపట్నం*

PREVIOUS NEXT

| | | |
|---|---|---|
| **Your Mail Id :** | | |
| **Mail This Link To email id :** | | Send Link |